


# అమెరికులాసా కథ – 203

## అమె'రికామీ' పుట్టిన రోజు కథ

**అప్పుడెప్పుడో చిన్నప్పుడు చాలా మందిలాగా** నేను కూడా ఒక్క సారే పుట్టాను. కాకినాడలో అనమాట. నేనూ, నాతో పాటు ఇంకొక సత్తరకాయా కలిసి పుట్టగానే నేను కేర్ మన్నానుట కానీ, ఆ రెండో వాడు కుయ్ కయ్ అనకుండానే మరో జన్మ లోకి వెళ్ళిపోయాడుట. ఆ సంగతి మా ఇంట్లో పాతిక పైగా పురుళ్ళు పోసిన మా ఎరకల స్త్తెమ్మ చెప్పింది. ఇక మా తాత గారు మేము పుట్టిన ఘడియా, విఘడియా వగైరా వివరాలు పంపించి రాజమండ్రిలో మా ఆస్థాన జ్యోతిష్కుల వారు సోమయాజుల గారి చేత జాతక చక్రం వేయించారు. ఆయన నాది అనూరాధా నక్షత్రం అనీ, తెలుగు తిధుల ప్రకారం నాది తేలు బుద్ధి అనీ కాగితం మీద రాసి ఇచ్చారు. అనగా వృశ్చిక రాశి. తప్పదు కాబట్టి ఆ రాశిలోనే బుద్ధిగా కొన్నాళ్ళు సంచరించాను. కానీ ఐదో ఏట అక్షరాభ్యాసం అయ్యాక మా ఇంటి పక్కనే ఎల్విన్ పేటలో ఉన్న ప్రాధమిక పాఠశాలలో ఒకటో తరగతిలో నన్ను వెయ్యడానికి మా నాన్న గారు నన్ను తీసుకెళ్ళగానే ఆ ప్రధానోపాధ్యాయులమ్మ మేరీ మాత "వీడి వయసు పది రోజులు తక్కువ ఉంది. ఇంకో ఏడాది అయ్యాక రండి." అని నన్ను అప్పుడు స్కూల్లో చేర్చుకోడానికి ఉన్న వయసు నిబంధనలతో గొడవ చేసింది. మరి మా నాన్న గారు లాయరు కదా. "ఓహో, అలాగా. వీడి సరి అయిన పుట్టిన రోజు ఏమిటో మా ఎరకల సత్తెమ్మ ని కనుక్కుని వస్తాను" అనేసి తిన్నగా రాజమండ్రి వెళ్ళి సోమయాజుల గారికి విషయం చెప్పి, నా పుట్టిన రోజు తేదీ పది రోజులు ముందు కి మార్పించేసి మరొక జాతక చక్రం వేయించేశారు. దీని ప్రకారం నా పుట్టిన రోజు ఇంగ్లీషు తేదీ ఏప్రిల్ 19కి మారిపోయింది. మేరీ మాత నన్ను స్కూల్లో చేర్చేసుకుంది. దీని లెక్కన నా రాశి గొర్రె పొట్టేలు. అన్నట్టు నిజంగా పుట్టిన తేదీ ఏప్రిల్ 29 లెక్కన అయితే నా ఆంగ్ల రాశి దున్నపోతు లేదా ఆంబోతు. ఆ విధంగా నాకు మూడు పుట్టిన రోజులు, మూడు జంతువుల అంశలూ ఉన్న కారణాన నేను ఈ విధంగా తయారు అయ్యాను అనీ, తన తండ్రి గారికి..అనగా మా మామ గారికి అసలు ఏ జాతకం చూపించి తనతో పెళ్ళికి ఒప్పించి ఇంత అన్యాయం చేశారో అనీ ఇప్పటికీ మా క్వీన్ విక్టోరియా ఉసూరు మంటూనే ఉంటుంది. అయితే ఈ మొత్తం తతంగం లో తప్పు అంతా మేరీ మాత దే కదా. ఇప్పటి లాగా లోవర్ పీకేజీ, అప్పర్ పాకేజీ లా అస్తవ్యస్తం వ్యవస్థ కాక హాయిగా ఒకటో క్లాసు, రెండో క్లాసు ..అలా ఉండే సమయం లో నా వయసు పది రోజులు తక్కువ అయితే ఆవిడ సొమ్మేం పోయింది? ఆ నాడు ఆ మాత పట్టు పట్టడం వలన నా పుట్టిన రోజుని మారిపోవడం, అలా మారిన దొంగ తేదీయే తర్వాత ఎస్.ఎస్.ఎల్.సి, డిగ్రీ, పాస్ పోర్ట్, గ్రీన్ కార్డ్, అమెరికా పౌరసత్వం, ఫేస్ బుక్కు, క్రెడిట్ కార్డులు, డ్రైవర్ లైసెన్సులూ.....ఒకటేమిటి...అంతా ఆవిడ ధర్మమే. చెప్పొద్దూ, మా క్వీన్ విక్టోరియా తెలుగు తిధుల ప్రకారం గొర్రె, ఇంగ్లీషు తేదీ ప్రకారం చేప రాశి....మరి ఈ రెండు జంతు అంశలతో నా మూడు అంశలలో ఏవి కలిశాయో కానీ మొత్తానికి మా పెళ్ళికి మా మామ గారు "తాంబూలాలు ఇచ్చేశారు". మేమిద్దరం మటుకు అబ్బే....ఏదో చిన్న చిన్న తగాదాలే కానీ అగ్నిహోత్రావధానులన్నంత సీన్ లేదు.

ఇంతకీ ఇదంతా ఇప్పుడు ఎందుకు గుర్తు వచ్చిందీ అంటే....మరి 2025 లో ఇది ఏప్రిల్ నెల కదా...నా మూడు పుట్టిన రోజులూ ఈ నెలలోనే వస్తాయి..ఈ యేడు స్పెషల్ ఏమిటంటే....కొంత మంది పండితులు శతాభిషేకం అంటారు కానీ మామూలు పరిభాషలో నేను ఇప్పుడు ఎనభైయవ పడిలో పడుతున్నాను అనమాట. దీన్ని అశీతి జన్మదినం అని కూడా అంటారు. ఈ సందర్భంగా మా ముగ్గురు సంతానం స్పెషల్ గా ఏదో చేద్దాం అన్నారు. అంటే వాళ్ళ "అమెరికన్" దృక్పథం ప్రకారం ఏదో అలాస్కాయో, హవాయీ యో ఓడ మీద విహారానికి వెడదాం అని అర్ధం. "అక్కడికీ, ఇక్కడికీ వెళ్తే వెళ్ళు" కానీ మన సంప్రదాయం ప్రకారం గుళ్ళో బుద్ధిగా పూజ మటుకు చేసుకో" అని మా ఊరి పెద్ద, మాకు ఆత్మీయుడు అయిన మల్లిక్ పుచ్చా ఘాట్టిగా సలహా ఇచ్చాడు. సంప్రదాయమూ, పుణ్యమూ, పురుషార్ధమూ మాట ఎలా ఉన్నా డబ్బు కలిసివస్తుంది కదా అనేసుకుని ఓడలూ, పడవలూ ప్రయాణం మానేసి పూజ చేసుకోడానికి ఒప్పేసుకున్నాను. పైగా శృంగేరి విద్యాభారతి ఫౌండేషన్ వారు ఎంతో ప్రతిష్టాత్మకం గా , అత్యంత వైభవోపేతంగా నెలకొల్పిన శ్రీ చంద్రమౌళీశ్వర, శ్రీ ఆది శంకర సమేత శ్రీ శారదాంబ దేవాలయం మా ఇంటికి చాలా దగ్గిర. ఆ దేవాలయం లో శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపనకి మహా దాత ఇంకెవరూ....మా మల్లిక్ పుచ్చా యే!. ఈ పూజ కోసం సన్మిత్రులు, ఆ దేవాలయ ప్రధాన సేవకులు (చైర్మన్) డా. దశిక లక్ష్మీ నరసింహం & భారతి గార్లని సంప్రదించగానే 80వ పుట్టిన రోజుకి మన సంప్రదాయం ప్రకారం నిర్వహించే పూజలు, హోమం మొదలైన అన్ని విధి విధానాలు ఆయన వివరించి బిల్లు ఎంత అవుతుందో కూడా చెప్పారు. ఆ ప్రకారం గణపతి, లక్ష్మి, అమృత, మృత్యుంజయ, ఆయుష్, దన్వంతరి, నవగ్రహ పూజ, కలశాభిషేకం, కుటుంబ దేవత పూజ, రుద్రాభిషేకం చేసి, నేనూ మా సతీమణీ దండలు మార్చుకుని వేద పండితుల చేత ప్రోక్షణ, వేద పఠనం ప్రక్రియలతో పూజ చేసుకుందాం అనీ, హ్యూస్టన్ లో మా చిరకాల మిత్రులు, బంధువులు సుమారు 50 కుటుంబాలని ఈ పూజకి ఆహ్వానిద్దాం అని నిర్ణయించుకున్నాం. ఆ కార్యక్రమం అంతా ఏప్రిల్ 19, 2025 నాడు జరిగింది. మా అత్మీయ మిత్రులు శాయి లలిత, శాయి రాచకొండ కొండంత అండగా మాకు ఎంతో సహాయం చేసి ఈ మొత్తం కార్యక్రమాన్ని దగ్గరుండి విజయవంతంగా జరిపించారు. ప్రధాన పురోహితులుగా శ్రీ మురళీ భట్ గారు, జగదీష్ గారు, ఇద్దరు వేద పండితులు సుమారు మూడున్నర గంటల సేపు ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. లలిత సహాయంతో దశిక భారతి గారి పర్యవేక్షణ లో ఆ దేవాలయం వారు అత్యంత రుచికరమైన మధ్యాహ్న విందు భోజనం ఏర్పాటు చేశారు. ఆ నాటి ఫొటోలు కొన్ని ఇక్కడ పెట్టాను.





డాలస్ నుంచి మా రెండో అమ్మాయీ, అల్లుడూ, మా వియ్యంకులు మురళీధర్ & రూపా తాతాచార్ గారి కుటుంబం, ఆస్టిన్ నుంచి మా సుపుత్రుడూ, హ్యూస్టన్ లోనే ఉండే మా పెద్దమ్మాయీ, పెద్దల్లుడూ, ఇద్దరు మనవరాళ్ళు, ఇద్దరు మనవలూ...అందరూ కలిసి చేయించిన ఈ వేడుకకి సుమారు 75 మంది బంధువులూ, ఆత్మీయ మిత్రులూ వచ్చి 'అప్పుడే పుట్టిన' నాకూ, మా సతీమణి గిరిజకీ బట్టలు పెట్టి కొందరూ, గ్రీటింగ్ కార్డులూ, నగదు, చెక్కులూ, గిఫ్ట్ కార్డులతో మరికొందరూ "ఆశీర్వదించారు". ఎప్పటిలాగానే ఆ నగదూ, చెక్కులూ, గిఫ్ట్ కార్డులూ మా సతీమణి కొట్టేయగా, ఉత్తుత్తి గ్రీటింగ్ కార్డులు మటుకు నాకు దక్కాయి! ఆ నాడు మా పూజా కార్యక్రమానికి వచ్చి మమ్మల్ని మహదానందభరితుల్ని చేసిన మిత్రులందరికీ మా వేనవేల ధన్యవాదాలు. రావడమే కాదు, ఈ అవకాశం చూసుకుని, మైక్ దొరికింది కదా పూజ అయిపోయాక కొందరు మిత్రులు నా మీద అభిమానం తో అవాకులూ, చెవాకులూ మాట్లాడి అందరినీ సంతోషపెట్టారు. అమెరికా పరిభాషలో ఇలాంటి ప్రసంగాలని "రోస్టింగ్" అంటారు. అంటే తిడుతున్నట్టు పొగుడుతూ ఆప్యాయంగా మాట్లాడడం...

ఈ పుట్టిన రోజు కి ఇంకా చాలా కోణాలు ఉన్నాయి...అనగా ఫేస్ బుక్, వాట్సాప్, టెలిఫోన్లు, ఇమైల్...వగైరాలు...ఇలా అనేక రకాలుగా నా మీద అభిమానం, గౌరవం, ప్రేమ, మొహమాటం వగైరాలతో అనేక దేశాల నుంచి నన్ను పలకరించి నాకు శుభాకాంక్షలు అందజేసిన శ్రేయోభిలాషులు అందరికీ నా మన:పూర్బక ధన్యవాదాలు. తమ ప్రత్యేక కవితలు, ఆత్మీయ వచనాలతో నన్ను పులకరించ చేసిన అనేక మంది మిత్రులకి తగిన స్థాయిలో కృతజ్ఞతలు తెలియజేయడానికి నా దగ్గర తగినంత భాష లేదు.

నా చిన్నప్పుడు మా అమ్మ కొత్త బట్టలు, స్వయంగా చేసిన పిండివంటలతో నా పుట్టిన రోజులు కొన్ని లీలగా మాత్రమే గుర్తున్నాయి కానీ, నా జీవితం లో ఇప్పటి దాకా గుర్తున్న ఒకే ఒక పుట్టిన రోజు మా తమ్ముడు ఆంజి (హనుమంత రావు), స్వర్ణ లాస్ ఏంజెలెస్ లో 2005 లో వాళ్ళింట్లో చేసిన నా షష్టిపూర్తి.



మా షష్టిపూర్తి –2005



మా బావ గారు, అక్క, తమ్ముడు, మరదలు, మా కుటుంబం

దానికి ఇండియా నుంచి మా అక్క, బావగారు నండూరి సూర్యనారాయణ మూర్తి గారు, రెండో చెల్లెలు అన్నపూర్ణ & బావ గారు దెందులూరి ప్రసాద్, మా మేనగోడళ్ళు ఐశ్వర్య, రాజీ విజయ్ , మా చిన్నన్నయ్య రెండో కొడుకు చినబాబు & మాధవి కుటుంబం, అందరి

పిల్లలూ కలిసి సుమారు ముప్పై మంది ఉన్నాం. షష్టిపూర్తి అయ్యాక అందరం కలిసి మాలిబు బీచ్, అక్కడ దేవాలయం, తర్వాత గ్రాండ్ కేన్యన్ మొదలైన చోట్లకి వెళ్ళి వారం రోజుల పైగా సంతోషంగా గడిపాం. ఆ నాటి రెండు ఫొటోలు కూడా ఇక్కడ పెట్టాను.

ఇలాంటి పుట్టిన రోజులు అన్నీ రికామీ లే...అంటే ఉత్తుత్తినే, సరదాకి చేసుకోవడానికీ, ఇలా డబ్బా కొట్టుకుంటూ వ్యాసాలు రాసుకోడానికే తప్ప ఇంకెందుకూ పనికి రావు అంటారా? ఏమో? ఎవరికి తెలుసు? ఎవరి తుత్తి వారిదే!. రికామీ అంటే తెలియని వారు నిఘంటువు చూడండి. "ఏమీ విలువ లేనిది, ఖాళీ" లాంటి అర్థాలు కనపడతాయి మరి.

**COMMENTS**